డ్రైయినేజీలో పూడిక తొలగించరూ..



భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామంలో మురుగుకాల్వను శుభ్రం చేయకపోవడంతో మట్టితో పూడుకుపోయి పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. దీంతో మురుగునీటి ప్రవాహం ముందుకు సాగక అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి మురుగుకాల్వలో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే ముప్పు



సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో పొలాలకు వెళ్లే మార్గంలో రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో రైతులు, పొలాలు కోసేందుకు వచ్చే హార్వెస్టర్, ట్రాక్టర్ల డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ అధికారులు సమస్య పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

వారం రోజులుగా నీటి వృథా



లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఇంటింటికీ శుద్ధ జలం అందించే మిషన్ భగీరథ పైపులైన్‌కు వారం రోజుల కిందట లీకేజీ ఏర్పడింది. దీంతో నీరంతా రోడ్డుపై వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు నిర్వహించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఈసారైనా పూర్తయ్యేనా..?

- పునాది దశలోనే సిరాల ప్రాజెక్టు పనులు
- మరో రెండు నెలల్లో వర్షాకాలం
- వేగవంతం చేయాలంటున్న ఆయకట్టు రైతులు



సిరాల ప్రాజెక్టు వద్ద పునాది దశలో పనులు

భైంసారూరల్: మండలంలోని సిరాల ప్రాజెక్టు పనుల్లో వేగం కనిపించడం లేదు. రెండేళ్లలో నాలుగు పంటలు కోల్పోయిన ఆయకట్టు రైతులు ఈయేడు వర్షాకాలంలోనైనా పంటలు సాగు చేసుకుందామన్న ఆశతో ఉన్నారు. కానీ ప్రాజెక్టు పనులు చూస్తే పూర్తయ్యేలా లేవు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులు పునరుద్ధరించేందుకు రూ.15.49 కోట్లతో టెండర్లను పిలిచింది. 12.8శాతం లెస్ టెండరుతో ఈ పనులు దక్కించుకొని ప్రారంభించిన ఓ కాంట్రాక్టరు పూర్తి చేసేలా కనిపించడం లేదు. గత ఎనిమిది నెలలుగా కట్ట చదును చేసి ఇప్పటికీ కూడా పునాది దశలోనే ప్రాజెక్టు పనులు కనిపిస్తున్నాయి. కట్ట తవ్వి అడుగు భాగంలో మొరం వేసి ఉంచారు. పూర్తిస్థాయిలో పురోగతి మాత్రం కనిపించడంలేదు. ఇలాగే ఉంటే ఈసారి కూడా ప్రాజెక్టులో నీరు నిలిపే పరిస్థితి ఉండదు.

నత్తనడకన నిర్మాణాలు..

కట్ట దశలోనే ఉన్న పనుల్లో ప్రధాన తూము నిర్మాణ విషయంలో ఇప్పటికైతే పనులు ప్రారంభించనే లేదు. చెరువులోనే మట్టిని తవ్వి అక్కడే వేస్తున్నారు. ఎనిమిది నెలల కిందట సిరాల ప్రాజెక్టు పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు నెమ్మదిగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇలా చేస్తే మరో ఏడాది వరకు కూడా పనులు పూర్తయ్యే అవకాశం ఉండదు.

ఎనిమిది నెలల్లో కన్పించని పురోగతి..

మరో రెండు నెలల్లో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఎనిమిది నెలలుగా పనుల్లో పురోగతి లేదు. అలాంటి మిగిలిన రెండు నెలల్లో ఏ విధంగా పనులు జరుగుతాయో తెలియడం లేదు. వర్షాలు ప్రారంభమైతే మహారాష్ట్ర వైపు నుంచి వరద భారీగా ఈ ప్రాజెక్టులోకి చేరుతుంది. అప్పటివరకు కట్ట ఎత్తు పెంచకుంటే వచ్చిన నీటితో మళ్లీ కోతకు గురయ్యే ప్రమాదం ఉంది.

ఆయకట్టు రైతుల ఆశలు...

ఇప్పటికే ప్రాజెక్టు లేక ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ప్రాజెక్టు కింద సిరాల, ఇలేగాం, దేగాం, మచ్కల్ శివారు ప్రాంతాల్లో 1800 ఎకరాలకు నీరు అందుతుంది. ప్రాజెక్టు పూర్తి చేసి కాలువ మరమ్మతు చేస్తే ఆయకట్టు రైతులకు రెండేళ్ల కష్టాలు దూరమవుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

రెండేళ్లుగా నష్టపోతున్నాం..



ఈసారైనా సిరాల ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చూడాలి. రెండేళ్లుగా పంటలు పండక నష్టపోతున్నాం. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పనులు పూర్తయి తే వర్షాకాలంలో పంటలు సాగు చేసే వీలుంటుంది. రైతులు నష్టపోకుండా వర్షాకాలంలోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి. – శ్రీనివాస్, రైతు, ఇలేగాం

పనులు కొనసాగుతున్నాయి

సిరాల ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్ల కిందట భారీ వర్షాలతో ప్రాజెక్టు కొట్టుకుపోయింది. పాతకట్ట భాగంలో బండరాళ్లను తొలగించారు. కట్ట పనులు సాగుతున్నాయి. మొరం వేసి కట్ట పనులు చేపడుతున్నాం. త్వరలోనే సిరాల ప్రాజెక్టు పనులు మరింత ముమ్మరం చేస్తాం. ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. – అనిల్, ఈఈ, నీటిపారుదలశాఖ

సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాస్

కుంటాల: స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కుంటాల మండల సమాఖ్య భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, 2025–26లో చేపట్టే కార్యక్రమాలు, మిగులు బడ్జెట్, రిజిస్ట్రేషన్, ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. సమావేశంలో డీపీఎం సాయిప్రసాద్, ఏపీఎం అశోక్, సమాఖ్య మండల అధ్యక్షురాలు లక్ష్మి, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, సీవో శివప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం

కుంటాలలోని స్త్రీశక్తి భవనంలో శ్రీ సరస్వతి సమాఖ్య మండల కార్యవర్గాన్ని శనివారం డీఆర్డీవో శ్రీనివాస్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బత్తుల కరుణ, కార్యదర్శిగా ఎం.సురేఖ, సహాయ కార్యదర్శిగా కె.రాధిక, కోశాధికారిగా ఎస్.కవిత, ఉపాధ్యక్షురాలిగా ఆర్.కవిత ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు. డీపీఎం సాయి ప్రసాద్, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు అన్యాయం చేయొద్దు'

భైంసారూరల్: గ్రామాల్లో చేపట్టే ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు మాత్రమే అర్హుల జాబితా తయారు చేయడం ఏంటని మండిపడ్డారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అర్హుల జాబితాను అంటించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, బీజేపీ నాయకులు అప్పాల రాకేశ్, సచిన్, యోగేశ్, భూమేశ్, శ్రీనివాస్, సాయినాథ్, చంద్రకాంత్ పటేల్, రామారావు, దుబాయ్ శీను, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు కట్టుకొని బీజేపీ నాయకుల నిరసన

కుభీర్: గ్రామాల్లో నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు.. అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపిక చేస్తున్నారని నిరసిస్తూ బీజేపీ నాయకులు శనివారం నల్లబ్యాడ్జీలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో నవనీత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో లబ్ధిదారుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించి.. అర్హులను ఎంపిక చేసేవారన్నారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుల పేర్లనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్న ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకర్, దత్తాత్రి, గులాబ్, వైద్యనాథ్, కనకయ్య, విష్ణు, భోజరాంపటేల్ తదితరులున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా బంద్



నిర్మానుష్యంగా మారిన ఖానాపూర్



కడెంలో మూసి ఉన్న దుకాణాలు

ఖానాపూర్: కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బంద్‌లో పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కడెం: పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా శనివారం మండలకేంద్రంలో బంద్ పాటించారు. వ్యాపారులు దుకాణాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భైంసాటౌన్: కశ్మీర్‌లోని పహల్గావ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్, నాయకులు మురళి గౌడ్, సిరాజొద్దీన్, సంతోష్‌కుమార్, రమేశ్ మాశెట్టివార్, తదితరులున్నారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. అయిమాన్ నాజ్‌కు రూ.60వేలు, అజర్‌ఖాన్‌కు రూ.55వేలు, సుమయ్య బేగంకు రూ.32,500, అరిఫా బేగంకు రూ.60వేలు విలువైన చెక్కులను అందజేశారు.

'భూభారతి'తో సమస్యలు పరిష్కారం



కుభీర్ : సొనారిలో మాట్లాడుతున్న భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్



ఎల్విలో మాట్లాడుతున్న తహసీల్దార్ లింగంమూర్తి

కుంటాల: భూభారతి చట్టంతో భూసమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కుంటాల రైతువేదికలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి కొత్త చట్టం ఎంతో ఉపయోగపడుతుందని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్‌సింగ్, డీటీ నరేశ్‌గౌడ్, ఏవో విక్రమ్, ఆర్‌ఐలు ఆడెల్లు, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని సొనారి రైతువేదికలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌ఐ నరేశ్ భూభారతి పోర్టల్‌లోని నిబంధనల గురించి వివరించారు. కొత్త చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థ రూపొందించారని.. భూసమస్యకు తహల్దార్ వద్ద న్యాయం జరగలేదని.. ఆర్డీవో.. అక్కడా సంతృప్తి చెందకుంటే కలెక్టర్ వద్ద పరిష్కరించుకోవచ్చని భూమి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. ధరణిలో మాదిరి కాకుండా నూతన చట్టంలో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో విచారణ జరుపుతారని అన్నారు. త్వరలో జిల్లాకో పైలట్ మండలాన్ని ఎంపిక చేసి.. జూన్ 2 నుంచి పోర్టల్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్పెషల్ ఆఫీసర్ శంకర్, భైంసా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనంద్‌రావు, వ్యవసాయాధికారి సారికరావు, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఎస్సై రవీందర్ ఉన్నారు.

సారంగపూర్: భూభారతి చట్టంతో ధరణి ద్వారా ఏర్పడిన సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తహశీల్దార్ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని మలక్‌చించోలి, స్వర్ణ గ్రామాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. సమస్యలున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ నర్సయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వచ్చే నెల నుంచి రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహిస్తారని.. ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ లింగంమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పలువురు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరుకు వినతి

భైంసాటౌన్: బాసర మండలంలోని కిర్గుల్ (కె) నుంచి కిర్గుల్(బి) వరకు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని.. మొరం(మట్టి) రోడ్డు మంజూరు చేయాలని కిర్గుల్(కె) గ్రామ నాయకులు కోరారు. శనివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. పోతన్న, రాజేందర్, సునీత, అనిత, వెంకట్‌రావు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నేతలు

సోన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. శనివారం వచ్చే నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. కొత్తగా నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసి కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గంజాల్ టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాజ్‌కుమార్, నవీన్, శ్రావణ్, మహేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కడెం: ఎలగడపలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భూషణ్



రాచాపూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న భీమ్‌రెడ్డి



సోన్ : కేంద్రం ప్రారంభిస్తున్న ఏఈఓ, రైతులు

కడెం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పంట విక్రయించి మద్దతు ధర పొందాలని ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. శనివారం మండలంలోని ఎలగడప, పెద్దూర్‌తండా, కొత్తమద్దిపడగ, దిల్దార్‌నగర్, సారంగాపూర్, లింగాపూర్, మాసాయిపేట్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజరమేశ్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, రమేశ్, శంకర్, సలీం, సత్తెన్న, లచ్చన్న, భూమారాజం, సీఈవో రాజేందర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు పోశెట్టి, నారాయణ, ప్రతాప్‌రెడ్డి, ఐకేపి సిబ్బంది ఉన్నారు.

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏఈవో ఉమామహేశ్వరి ప్రారంభించారు. అంతకుముందు సోన్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి తేమ శాతం పరిశీలించారు. రైతులకు సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని మొహాళకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దండే రమేశ్ నానమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలిసి శనివారం జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్.. వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రశాంత్, ప్రకాశ్, గంగాధర్ ఉన్నారు.

క్లుప్తంగా

సౌకర్యాలు కల్పించాలి

కుంటాల: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్.. సిబ్బందికి సూచించారు. శనివారం కుంటాలలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో కొనుగోళ్లను చేపడతామని రైతులకు భరోసానిచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు కొత్తపల్లి బుచ్చన్న, మహేందర్, గల్లాపురం రమేశ్, దిగంబర్, వెంకటేశ్, హైమద్ పాషా, సీఈవో మురళి, రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె

బాసర: తమ సమస్యలు పరిష్కరించాలని బాసర ఆర్జీయూకేటీ ఒప్పంద అధ్యాపకులు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆర్జీయూకేజీ గేటు వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎంను ప్రత్యక్షంగా కలిసి వినతిపత్రం ఇవ్వలేక.. ఆయన చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. డాక్టర్ రమాదేవి, డాక్టర్ రాములు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ప్రభాకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పంట తడుస్తుందనే భయంతో రైతులు కవర్లతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలివెళ్లారు. ఈదురుగాలులకు పలు హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కిందపడ్డాయి. తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పట్టణ వాసులు ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత కొంచెం వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది.

కాపాడిన కానిస్టేబుల్



మహిళతో కానిస్టేబుల్ మోహన్‌సింగ్

బాసర: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కానిస్టేబుల్ కాపాడిన ఘటన శనివారం బాసరలో చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా ముల్లంగి గ్రామానికి చెందిన జనపల్లి శైలజ బాసరలోని గోదావరి నదిలో దూకేందుకు యత్నించగా అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ ఆమెను కాపాడి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. కౌన్సిలింగ్ నిర్వహించిన ఎస్సై, పోలీస్ సిబ్బంది.. శైలజను కుటుంబసభ్యులకు అప్పగించారు. గత 24 గంటల్లో ముగ్గురు మహిళలను కాపాడిన మోహన్‌సింగ్‌ను ఎస్సై, సిబ్బంది అభినందించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల యువకులు, కడెం మండలంలోని ఉడుంపూర్, నర్సాపూర్ గ్రామాల యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ వారికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

'ఆక్రమణలు తొలగించాలి'



మాట్లాడుతున్న కమిషనర్, సీఐ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై వీధి వ్యాపారులు, దుకాణదారులు ఏర్పాటు చేసిన ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్, సీఐ జి.గోపినాథ్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వీధివ్యాపారుల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోడ్డుపైకి వచ్చేలా వ్యాపారులు సామగ్రి పెట్టవద్దని.. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అలాగే వేకువజామున నిర్వహించే కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను గంజ్ ప్రాంతంలో, సోమవారం మార్కెట్‌ను డీసీఎం అడ్డా ప్రాంతానికి తరలించడంపై సీఐ గోపినాథ్ వారితో చర్చించారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వీధివ్యాపారులు, కూరగాయల విక్రేతలు సహకరించాలని కోరారు.

గ్రాడ్యుయేషన్ డే

ఖానాపూర్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌తోపాటు సుభాష్‌నగర్–1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సూపర్‌వైజర్ శ్యామల చేతుల మీదుగా చిన్నారులకు అసెస్‌మెంట్ కార్డులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు సరళ, సరోజ, మమత తదితరులు ఉన్నారు.